నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 | RAJANNA SIRCILLA

## అగ్రిటెక్ సదస్సుకు రైతులకు ఆహ్వానం

పెద్దపల్లి, ఫిబ్రవరి 15: సేద్యంలో ఆధునిక విధానాలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కోసం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఈ నెల 16 నుంచి 18 వరకు నిర్వహించే అగ్రిటెక్ సౌత్ –2024 ఎగ్జిబిషన్, సదస్సుకు రైతులను ఆహ్వానిస్తున్నట్లు పెద్దపల్లి డీఏవో ఆదిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక అభివృద్ధిని రైతులకు పరిచయం చేసేందుకు భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో వ్యవసాయ ఉత్పత్తులు, పునరుత్పత్తి వ్యవసాయం, పశు సంరక్షణ, చేపలు, కోళ్ల పెంపకం, ఆయిల్ పామ్ సాగు, వ్యవసాయ యాంత్రీకరణ, ఉద్యాన పంటలు, సమీకృత పద్ధతులు, రైతు ఉత్పాదన సంస్థలు, అగ్రి స్టార్టప్‌ల గురించి చర్చలు జరుగుతాయని, సంస్థల సాంకేతిక అభివృద్ధి ప్రదర్శన ఎగ్జిబిషన్‌లో ఉంటుందని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ రసాయనాలు, వ్యవసాయ పరికరాలు, పాడి, మత్స్య పరిశ్రమ, సేంద్రియ వ్యవసాయం, సేద్యంలో డిజిటల్ సాంకేతికతపై రెండు రోజులపాటు కాన్ఫరెన్స్ సెషన్స్ ఉంటాయని వివరించారు. సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పెద్ద సంఖ్యలో సందర్శించాలని కోరారు. వివరాలకు డానియల్ జార్జ్ 9849114758, ప్రణీత 9849470365 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## సుల్తానాబాద్‌లో ఖేలో ఇండియా ఖోఖో సెంటర్



సుల్తానాబాద్, ఫిబ్రవరి 15: ఖోఖో క్రీడకు మహర్దశ పట్టనున్నది. ఖేలో ఇండియాలో భాగంగా క్రీడలకు పుట్టినిల్లు అయిన సుల్తానాబాద్‌కు ఖోఖో సెంటర్ మంజూరైంది. ఈ విషయాన్న జిల్లా యువజన క్రీడాధికారి ఏ సురేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు మూడు రోజుల్లో సుల్తానాబాద్ మార్కండేయ కాలనీలో ఉన్న మినీ స్టేడియంలో శిక్షణకు ఏర్పాటు చేస్తున్నామని, క్రీడాకారులకు ప్రతి రోజూ శిక్షణ ఇస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు తమ ఆధార్ కార్డు జిరాక్స్‌తో అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు గెల్లు మధుకర్‌యాదవ్‌ను సంప్రదించాలని సూచించారు. ఖోఖోలో సుల్తానాబాద్ ప్రాంతవాసులకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఇక్కడి నుంచి ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన చరిత్ర ఉందని వివరించారు. కొత్తగా సెంటర్ ఏర్పాటు చేయడంతో మరింత మంది క్రీడాకారులకు లాభం జరుగుతుందని చెప్పారు. వివరాలకు 7995078488 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

## టీయూఎఫ్ఐడీసీ నిధులివ్వండి

**అసెంబ్లీలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్**



జగిత్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : జగిత్యాల జిల్లా కేంద్రం శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక వసతులు సమకూర్చుకునేందుకు టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అసెంబ్లీలో కోరారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తమ నియోజకవర్గానికి 4520 డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించగా, వాటి నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశామని, ఆ కాలనీలో తాగు నీటి వసతిని ఏర్పాటు చేశామని, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులు మంజూరయ్యాయన్నారు. అయితే, టీయూఎఫ్ఐడీ నిధులను వీటికి కేటాయించరాదనే నిబంధన దృష్టికి వచ్చిందని, జగిత్యాల పట్టణ పేదరిక నిర్మూలన కోసం కేటాయించిన కాలనీ కనుక టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా గతంలో మంజూరు చేసిన ప్రొసీడింగ్‌ల ద్వారా కొందరు నిరుపేదలు ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించారని, వీరిని ఇందిరమ్మ ఇండ్ల పథకంలో చేర్చి నిధులు మంజూరు చేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి గతంలో ఎమ్మెల్యేలకు కేటాయించిన విధంగా ఏసీడీపీ నిధులు మంజూరు చేయాలని, స్థానిక ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ అమలు చేయాలని సభ ద్వారా స్పీకర్‌ను కోరారు.

## రెండో విడుత 'దళితబంధు' ఇవ్వండి

**అసెంబ్లీలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి**



హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 15 : రెండో విడుత దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన అసెంబ్లీ జీరో అవర్‌లో మాట్లాడారు. హుజూరాబాద్ నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల అభ్యున్నతి కోసం పైలెట్ ప్రాజెక్టుగా హుజూరాబాద్‌ను ఎన్నుకొని దళిత బంధు అమలు చేశారని, అందులో 18 వేల పైచిలుకు కుటుంబాలకు లబ్ధి చేకూరిందని, రెండో విడుత సుమారు 2800 కుటుంబాలకు రావాల్సి ఉందన్నారు. వారి అకౌంట్లలో కూడా డబ్బు జమై ఉందని, బ్యాంకు అధికారులు అకౌంట్లను ఫ్రీజ్ చేశారని, దానిని ఎత్తివేసి వెంటనే దళితులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. దళితబంధు రెండో విడుత రాదేమోనని నియోజకవర్గంలోని ఇద్దరు దళితులు ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే, నియోజకవర్గంలోని కమలాపూర్ మండలం శనిగరం, గోపాల్‌పూర్, మాదన్నపేట చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందడం లేదని, వెంటనే చివరి ఆయకట్టు వరకు నీరందించేలా అధికారులను ఆదేశించాలన్నారు. హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానలో ఐసీయూ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని, వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు లక్షా అరవై వేల పైచిలుకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, గత రెండు నెలలుగా ప్రభుత్వం వారి అకౌంట్లలో జీతాలు కూడా వేస్తున్నదని, తమ ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చింది అనడానికి సాక్ష్యం కూడా అదేనన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగాల నియామక పత్రాలు కూడా కేసీఆర్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాల్లో భాగమేనన్నారు.

## చక్కెర ఫ్యాక్టరీ కమిటీ గురించి చెప్పండి

**అసెంబ్లీలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల**



మెట్‌పల్లి, ఫిబ్రవరి 15 : తమ నియోజకవర్గంలోని ముత్యంపేట నిజాం చక్కెర ఫ్యాక్టరీపై ప్రభుత్వం కమిటీ వేసినట్లు ఇటీవల ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్నానని, దీని గురించి తనకు పూర్తి సమాచారం ఇవ్వాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల కోరారు. ఈ మేరకు అసెంబ్లీలో గురువారం జీరో అవర్‌లో కోరుట్ల నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ముందుగా శాసనసభ్యుడిగా ఎన్నికైన అనంతరం తొలిసారిగా సభలో మాట్లాడే అవకాశం వచ్చినందుకు శాసనసభాపతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. చక్కెర ఫ్యాక్టరీపై వేసిన కమిటీ గురించి తమకు ఎలాంటి సమాచారం లేదని, చెరుకు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు సంబంధిత అంశాలను కమిటీ దృష్టికి తీసుకెళ్లడానికి ఈ ప్రాంత ఎమ్మెల్యేగా బాధ్యత తనకు ఉంటుందన్నారు. ఏ కమిటీ వేశారు, ఆ కమిటీ తీసుకునే చర్యలు, విధి విధానాలు ఏంటో తమకు చెప్పాలని కోరారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల అభివృద్ధి కోసం టీయూఎఫ్ఐడీసీ నుంచి గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులను నిలిపేయాలని నిర్ణయించిందని, అభివృద్ధి పనులు కొనసాగేందుకు నిధులను విడుదల చేయాలని కోరారు. కోరుట్ల డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ బాధితుల సంఖ్యకు అనుగుణంగా సంబంధిత మిషన్లు సరిపోవడం లేదని, వెంటనే డయాలసిస్ మిషన్ల సంఖ్యను పెంచినట్లైతే పేద కిడ్నీ బాధితులకు మేలు జరుగుతుందని సంబంధిత మంత్రికి విజ్ఞప్తి చేశారు.



ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో సాగవుతున్న పసుపుపంట

# పసుపు రైతుకు ఆశలు..

- జగిత్యాల జిల్లాలో 22వేల ఎకరాల్లో సేద్యం
- దిగుబడి తగ్గినా.. ఆశాజనంకగా ధరలు
- మార్కెట్‌లో క్వింటాల్‌కు ₹12 వేలకు పైనే
- పసుపు బోర్డు ఏర్పాటైతే మరింత ప్రయోజనం

**పసుపు రైతు పంట పండుతున్నది. గతంలో పోలిస్తే ఈ యేడు పసుపు లాభాలు కురిపిస్తున్నది. జగిత్యాల జిల్లాలో ఈ సీజన్‌లో 22వేల ఎకరాల్లో సేద్యం చేయగా, దిగుబడికి తగ్గ రేటు వస్తున్నది. రెండు రోజుల క్రితమే మెట్‌పల్లి మార్కెట్‌లో కొనుగోళ్లు ప్రారంభం కాగా, క్వింటాల్‌కు గరిష్ఠంగా ₹12వేల పైనే పలుకుతున్నది. కొన్నేండ్లుగా ధరలు లేక కుదేలైన రైతులకు, ఈ సారి పెరిగిన ధరలతో భరోసా కలుగుతున్నది.**

మెట్‌పల్లి, ఫిబ్రవరి15: జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్లతోపాటు నిజామాబాద్ జిల్లాలో పసుపు పంటను ప్రధానంగా సాగు చేస్తున్నారు. 2023–24 సంవత్సరంలో జగిత్యాల జిల్లాలో 22 వేల ఎకరాల్లో సేద్యం చేశారు. ఇప్పుడిప్పుడే పసుపు పంట దిగుబడి వస్తున్నది. కాగా, పసుపు సాగు దుక్కి దున్ని విత్తనం విత్తిన నుంచి పంట దిగుబడి దాకా ఎకరానికి ₹50వేల నుంచి ₹70 వేల దాకా పెట్టుబడి అవుతున్నది. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉన్నా.. వాతావరణ పరిస్థితులతో 15 నుంచి 20 క్వింటాళ్లే వస్తున్నది. అయితే ఈ సారి ధరలు పెరగడం రైతులకు కలిసివస్తున్నది.



మెట్‌పల్లి మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా పసుపుకొమ్ములు

### క్వింటాల్‌కు ₹12వేలు

పసుపు మార్కెట్‌కు నిజామాబాద్ తర్వాత మెట్‌పల్లి ప్రసిద్ధి. ఇప్పుడిప్పుడే పంట ఉత్పత్తి చేతికి వస్తున్నది. రెండ్రోజుల క్రితమే మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో పసుపు క్రయ, విక్రయాలు మొదలయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో గరిష్ఠంగా క్వింటాల్‌కు ₹12 వేలకు పైనే ధరలు పలుకుతున్నాయి. ఐదారేళ్ల తర్వాత ఈధర వస్తుండడంతో రైతుల్లో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈసారి దిగుబడి కాస్త తగ్గినా.. ఆశించిన ధరలతో తమకు ప్రయోజనం చేకూరుతున్నదని చెబుతున్నారు. పసుపు పంట చేతికి రావడంతో తవ్వకాలు మొదలు పెట్టి, (కొమ్ము, మండ)ను మార్కెట్‌కు తరలిస్తున్నారు.

### క్యాష్ కటింగ్

పసుపు కొనుగోలు చేసిన వెంటనే రైతుకు డబ్బులు చెల్లించాలి. కానీ, వ్యాపారులు రైతుకు సకాలంలో డబ్బులు ఇవ్వకుండా నెల గడువు పెడుతున్నారు. విక్రయించిన వెంటనే డబ్బులు ఇస్తే పంట సాగు కోసం తెచ్చిన అప్పులు, ఇతరత్రా అవసరాలకు వినియోగించుకుంటారు. అయితే వ్యాపారులు విధించిన గడువుదాకా ఆగలేక వెంటనే డబ్బులు కావాలని రైతు అడిగితే మాత్రం అదే అదనుగా 2 శాతం క్యాష్ కటింగ్ చేస్తున్నారు. ఈ దోపిడీతో తాము నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

### పత్తాలేని పసుపు బోర్డు


ఆరు నెలల కిందట నిజామాబాద్ బహిరంగ సభా వేదికగా ప్రధాని మోదీ స్వయంగా పసుపు బోర్డు ప్రకటించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. కానీ, అందుకుపసుపు బోర్డు తెలంగాణలో ఎక్కడ ఏర్పాటు చేస్తామనేది స్పష్టత లేదు. మరో వైపు ఆరు నెలలు గడిచిన ఇప్పటికీ పసుపు ఏర్పాటుపై ఎలాంటి కదలిక లేదు. రైతులకు ప్రయోజనం చేకూరిందీ లేదు.



### ధర మంచిగానే ఉన్నది

ఈ సారి మంచి ధర మంచిగున్నది. కానీ, దిగుబడి సరిగా లేదు. మేం రెండెకరాల్లో పసుపు వేసినం. గతేడాది 60 డ్రమ్ములు ఎల్లింది. ఇప్పుడు 35 డ్రమ్ములే వచ్చింది. ఎకరానికి ₹70వేల నుంచి ₹80వేలు పెట్టుబడి అయితది. కొన్నేండ్ల సంది పసుపు ధరలు బాగా లేవు. ఇప్పుడు క్వింటాల్‌కు ₹12 వేల నుంచి ₹13 వేలు అంటున్రు. దిగుబడి పడిపోయినా ధర మంచిగానే ఉన్నది. అయితే అచ్చిన లాభం ఆడికాడికే అచ్చినట్లు ఉంది.

**- క్యాతం ప్రమీల, మహిళా రైతు (యామాపూర్)**



### దిగుబడి తగ్గింది

నేను ఏటా పసుపే పండిస్త. ఎకరం 30 గుంటల్లో వేసిన. ఈ సారి ధరలు మంచిగ ఉన్నయి కానీ, ఏం లాభం లేదు. పంట దిగుబడి పోయిన ఏడాది కంటే సగం తగ్గింది. అప్పుడు 40 డ్రమ్ముల పసుపు ఎల్లితే, ఇప్పుడు 20 డ్రమ్ములే ఎల్లింది. ధర పెరిగిందని సంబురపడాలా... దిగుబడి పడిపోయిందని బాధపడాలో అర్థమైతలేదు. క్వింటాల్‌కు ₹15 వేలు పైన ఉంటేనే మేలు జరుగుతది.

**- ఇట్టెడి ప్రమీల, మహిళా రైతు (యామాపూర్)**

## పసుపు క్వింటాలు ధర రూ.12,559

మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో రెండో రోజు గురువారం పసుపు కొనుగోలు జరిగాయి. పసుపు కాడి (కొమ్ము) క్వింటాల్‌కు గరిష్ఠ ధర ₹12,559, కనిష్ఠ ధర ₹4,059, పసుపు గోళ (మండ) క్వింటాల్‌కు గరిష్ఠ ధర ₹11,111, కనిష్ఠ ధర 6,565, పసుపు చూర క్వింటాల్‌కు గరిష్ఠంగా ₹10,500, కనిష్ఠంగా ₹9,166 ధర పలికింది. అదే విధంగా పసుపు క్రయ, విక్రయాలు ప్రారంభమైన మొదటి రోజు మార్కెట్‌లో 285 క్వింటాళ్లు, రెండో రోజు 203 క్వింటాళ్ల పసుపు కొనుగోలు జరిగినట్లు మార్కెట్ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

## మార్చికి ముందే ..



వేసవి కాలం ప్రారంభానికి ఇంకో రెండు వారాల సమయం ఉన్నా అప్పుడే ఎండలు అదరగొడుతున్నాయి. ఈ నెల మొదటి వారం వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల లోపే ఉండగా, రెండు మూడు రోజులుగా 33 డిగ్రీలు నమోదవుతున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా ఈ నెల మొదటి వారంలో 18 డిగ్రీల వరకే ఉండగా, రెండు మూడు రోజులుగా 21 డిగ్రీలుగా రికార్డవుతున్నాయి. ఉదయం పదకొండు గంటల నుంచే ఎండ ప్రభావం కనిపిస్తున్నది. వివిధ పనుల కోసం బయటకు వెళ్లే ప్రజలు గొడుగులు పట్టుకెళ్తుండగా, మహిళలు, యువతులు కొంగులు, చున్నీలు కప్పుకుంటున్నారు.

**- కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్**




ర్యాగింగ్ వార్నింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామగుండం సీపీ, కళాశాల ప్రిన్సిపాల్

## ర్యాగింగ్ నేరం

**సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకంగా ఉండాలి**
**రామగుండం సీపీ శ్రీనివాసులు**

ఫర్టిలైజర్‌సిటీ, ఫిబ్రవరి 15 : ర్యాగింగ్ శిక్షార్హమైన నేరమని, ర్యాగింగ్‌కు పాల్పడితే నిరోధక చట్టం మేరకు చర్యలుంటాయని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాసులు హెచ్చరించారు. కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్లకు ఒక గైడ్, సోదరుల్లా మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. గోదావరిఖని మెడికల్ కళాశాలలో గురువారం పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను నిర్మించడంలో కళాశాల క్యాంపస్ కీలకమని చెప్పారు. ర్యాగింగ్ రహిత క్యాంపస్‌గా మార్చడానికి విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. తాను రామగుండం సీపీగా బాధ్యతలు తీసుకున్న రోజు ఈ కళాశాలలో ర్యాగింగ్ ఘటన కలచివేసిందని, దీంతో విద్యార్థులకు కౌన్సిలింగ్, సలహాలు కాకుండా భవిష్యత్‌లో ర్యాగింగ్‌కు పాల్పడకూడదని హెచ్చరించాలని ఈ సదస్సు చేపట్టినట్టు తెలిపారు. తోటి విద్యార్థులతో సుహృద్భావ వాతావరణం ఉండేలా చేసుకోవాలన్నారు. అన్ని కళాశాలల్లో షీటీంలు మఫ్టీలో తిరుగుతూ బాడీ కెమెరాలతో రికార్డు చేస్తూ నిరంతరం నిఘా పెడుతాయని చెప్పారు. అనంతరం కాలేజీ సిబ్బంది, విద్యార్థులతో కలిసి 'ర్యాగింగ్ అనేది నేరం' అనే వార్నింగ్ పోస్టర్‌ను సీపీ ఆవిష్కరించారు. ఇక్కడ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, పెద్దపల్లి సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం జ్యోతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నుచ్చు శ్రీనివాస్, సీడీపీఓ కమలాకర్, వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్, షీటీమ్ ఎస్ఐలు రాజేంద్రప్రసాద్, హైమ, ఎస్ఐలు శరణ్య, సుగుణాకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నేత కార్మికులకు ముద్ర రుణాలు

- సెక్యూరిటీ, మార్టిగేజ్ లేకుండా అందిస్తాం
- నేతన్న యాప్‌పై అవగాహన కల్పించాలి
- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



చేనేత వస్త్రాలను శాంపిల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : నేత కార్మికులకు ఎలాంటి సెక్యూరిటీ, మార్టిగేజ్ అవసరం లేకుండా ముద్ర రుణాలు అందజేస్తున్నట్లు కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం చేనేత కార్మికుల కోసం కొత్తగా రూపొందించిన టీ–నేతన్న యాప్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులకు మూలధన అవసరాల కోసం చేనేత ముద్ర లోన్స్ ద్వారా గరిష్ఠంగా ₹5 లక్షల రుణాన్ని 25 శాతం మార్జిన్ మనీ సబ్సిడీ, గరిష్ఠంగా ₹10 వేల ఎంవోటీ ఇవ్వడంతోపాటు ప్రగతి ఆధారంగా 6 నుంచి 7 శాతం వరకు వడ్డీ రాయితీ కల్పించనున్నట్లు వెల్లడించారు. బ్యాంకుల్లో ముద్ర లోన్లపై మార్టిగేజ్, సెక్యూరిటీ అడిగినట్లయితే తమ దృష్టికి తేవాలని సూచించారు. చేనేత, పవర్‌లూం కార్మికుల కోసం అందిస్తున్న వివిధ పథకాల రాయితీ కోసం టీ–నేతన్న యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. అధికారులు ఈ యాప్‌పై సంపూర్ణ సమాచారాన్ని లబ్ధిదారులకు కల్పించాలన్నారు. నేత కార్మికులు తయారు చేసిన టవల్స్, కర్టెన్స్‌ను ప్రభుత్వ కార్యాలయాల్లో వినియోగించేలా చర్యలు చేపడుతామన్నారు. అలాగే, మార్కెటింగ్ కోసం కృషి చేస్తామన్నారు. ఒకే విధమైన ఉత్పత్తులు కాకుండా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చేనేత ఉత్పత్తుల్లో మార్పులు తేవాలని సూచించారు. నేతన్న యాప్‌లో సాంకేతిక సమస్యలను వారంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ వీ అశోక్‌రావు, సహాయ సంచాలకులు ఎస్ఎస్ చరణ్, టెస్కో డీఎంవో వెంకటేశ్వర్లు, కోర్కల్ చేనేత సహకార సంఘం పీఐసీ సత్యనారాయణ, ఊటూరు చేనేత సహకార సంఘం పీఐసీ రాంచంద్రం పాల్గొన్నారు.

## నేతన్నకు ఆర్డర్లు ఇవ్వాలి

- గర్శకుర్తి పవర్ లూమ్స్ పరిశ్రమను ఆదుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



గర్శకుర్తిలో పవర్‌లూమ్స్ కార్మికులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, ఫిబ్రవరి 15 : గర్శకుర్తి గ్రామ పవర్ లూమ్స్ వస్త్ర పరిశ్రమకు బతుకమ్మ చీరల తరహా గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలని, నేత కార్మికులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గర్శకుర్తిలోని పవర్ లూమ్స్‌ను ఆయన సందర్శించి, కార్మికులతో మాట్లాడారు. గ్రామ పవర్ లూమ్స్‌కు 2022లో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 17 ఎస్ఎస్ఐ యూనిట్లకు 20 లక్షల మీటర్లు, 2023లో 33 ఎస్ఎస్ఐ యూనిట్లకు 32 లక్షలా 26 వేలా 750 మీటర్ల బతుకమ్మ చీరల ఉత్పత్తికి ఆర్డర్లు కల్పించిందని గుర్తు చేశారు. అదేవిధంగా 2 లక్షలా 13 వేల 860 మీటర్ల స్కూల్ యూనిఫామ్ బట్ట, 24 వేల మీటర్ల రంజాన్ క్లాత్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. దీంతో కార్మికులు జీవనోపాధి పొందారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల తరహా గుడ్డ ఉత్పత్తికి ఎలాంటి ఆర్డర్లు కల్పించకపోవడంతో కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ వైపు బతుకమ్మ చీరల ఆర్డర్లు లేక నేతన్నలు ఇబ్బంది పడుతుంటే మరో వైపు చేనేత జౌళీ శాఖ విజిలెన్స్ అధికారులు పవర్ లూమ్స్ గుడ్డ ఉత్పత్తులపై దాడులు చేస్తూ కేసులు పెట్టడం హేయమైన చర్య అని మండిపడ్డారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే గతంలో మాదిరిగా నేత కార్మికుల ఆకలి చావులు, ఆత్మహత్యలు పునరావృతం అవుతాయని చెప్పారు. విజిలెన్స్ అధికారులు చేసిన కేసులు మాఫీ చేయాలని కోరారు. ఇక్కడ నాయకులు మేచినేని నవీన్‌రావు, అలువాల తిరుపతి, వేముల దామోదర్, రామిడి సురేందర్ పాల్గొన్నారు.